
# అంగారక గ్రహయాత్ర

అది పాపికొండలలోని అటవీ ప్రాంతం. దట్టంగా పెరిగిన చెట్లు గాలికి చేసే చప్పుళ్ళూ, పక్షులరవాలు, జంతువుల అరుపులు మొదలైనవాటితో ఆ ప్రదేశం భయం కల్పించేట్లుగా ఉంది. అటువంటి నిర్జన ప్రదేశంలో ప్రముఖ భూతత్త్వ శాస్త్రవేత్త డాక్టర్ మూర్తి తన పరివారంతో గుడారం వేసుకొని ఉన్నాడు. అక్కడికి కొంచెం దూరంలో విస్తారమైన ఇనుపగనులు వుండే అవకాశం ఉన్నట్లు ఆయన బృందం కనుగొంది. వాటినిసర్వేచేసే ఉద్దేశంతో అక్కడే కాంప్ వేసుకొని ఉన్నాడు ఆయన.

డాక్టర్ మూర్తి వృత్తిరీత్యా భూతత్త్వ శాస్త్రజ్ఞుడైనా ప్రవృత్తిరీత్యా ఖగోళశాస్త్రవేత్త. అంతరిక్షశాస్త్రం అంటే ఆయనకి ప్రత్యేకమైన అభినివేశం ఉంది. డాక్టర్ ఆనంద్ ఆయన ప్రాణస్నేహితుడు. వృత్తిరీత్యా ఆయన వైద్యుడేకాని, ఆయనకి కూడా ఖగోళశాస్త్రమంటే ప్రత్యేక అభిమానం. ఈ అభినివేశమే వారిద్దరినీ సన్నిహితులను చేసింది. వారిద్దరు కలిసి డాక్టర్ మూర్తి సొంతంగా నెలకొల్పుకున్న ఖగోళ వేధశాలలో ఎన్నో పరిశోధనలు చేస్తుండేవారు. ఖగోళ విషయంలో అమెరికా, రష్యాలు అద్భుతమైన ప్రగతిని సాధించాయి. రష్యా తొలిసారిగా అంతరిక్షంలోకి మానవుని ప్రవేశపెట్టగలిగితే, అమెరికా ఏకంగా చంద్రమండలంపైనే తొలిమానవుని దింపగలిగింది. రష్యా మానవరహిత శకటం "మూన్ బగ్గీ"ని చంద్రునిమీద తిరుగాడ జేసి అనేక ప్రాంతాల శిలలను సంగ్రహించి భూమికి తెప్పించగలిగింది. ఈ రెండు దేశాలుకూడా మానవరహిత అంతరిక్ష నౌకలను అంగారక శుక్రగ్రహాల మీదకి పంపగలిగాయి. భారతదేశం కూడ ఈ రెండు దేశాలవలె అంతరిక్ష రంగంలో అద్భుత విజయాలు సాదించాలని మిత్రులిద్దరు ఉవ్విళ్ళూరుతుండేవారు. తాము గ్రహాంతర యానం చేయగలిగితే తమజన్మ ధన్యమవుతుందని కలలు కంటుండేవారు.

ఆ రోజు ఇనుపగనులున్న ప్రదేశంలో డైనమైట్ పెట్టి ప్రేల్చడానికి అంతాసిద్ధం అయింది. మూర్తి ఆనంద్‌లు దూరాన్నించి బైనాక్యులర్స్‌తో ఆ దృశ్యాన్ని తిలకించడానికి సిద్ధంగా ఉన్నారు.

"ఢాం" అంటూ డైనమైట్ పేలింది. చిచ్చుబుడ్డినుండి వచ్చే రవ్వల్లా పెద్ద పెద్ద రాళ్ళు ఎగిరిపడుతున్నాయి. మట్టి, పొగ కలిసి కుక్కగొడుగు ఆకారంలో ఆకాశంలోకి లేచాయి. ఆ దుమ్ములోనుంచి రాళ్ళు క్రింద పడ్తుండటం కనిపిస్తోంది. ఇంతలో వారిద్దరు తమ కళ్ళను తామే నమ్మలేని దృశ్యాలను



చూశారు. అదిచూసి వారు ఆశ్చర్యంతో కొయ్యబారి పోయారు. కొంచెంసేపటికి తెప్పరిల్లి ఒకరినొకరు ప్రశ్నార్థకంగా చూసుకున్నారు.

వాళ్ళను అంతగా విభ్రాంతులను చేసిన దృశ్యం ఇది. సరిగా డైనమైట్‌ను ఉంచిన చోటికి చుట్టూ వున్న కొద్ది ప్రదేశాన్నుండి ఎగిరిన రాళ్ళు క్రిందకు రాకుండా రాకెట్లులా ఆకాశంలోకి నిటారుగా ఎగిరిపోయాయి. ఆ వింత సంఘటనను పరిశోధించడానికి వారిరువురూ హుటాహుటిన అక్కడికి బయలుదేరారు.

డైనమైట్ స్వతహాగా ఉంచినచోట గోయి యేర్పడింది. దానిచుట్టూ సుమారు ఒక గజం మేరకు తెల్లటి గట్టి పదార్థం ఏర్పడింది. దానిమీద కొన్ని రాళ్ళు చెదురుగాపడి ఉన్నాయి. అక్కడి ఉష్ణోగ్రతను కొలిచే ఉద్దేశంతో మూర్తి జేబులో నుంచి తెర్మామీటర్‌ను తీసి ఆ పదార్థం మీద ఉంచాడు. అక్కడి ఉష్ణోగ్రత మామూలుగానే ఉంది. వెంటనే ఒక కాలును దానిమీద పెట్టి దాని గట్టిదనాన్ని పరీక్షించే ఉద్దేశంతో అదిమాడు. వెంటనే అప్రయత్నంగా ఒక వెర్రికేక పెట్టాడు. ఆనంద్ ఆ అరుపుకు ఉలిక్కిపడి "ఏమైంది?" అంటూ దగ్గరకు వచ్చాడు.

మూర్తి తన ఎడమకాలును దానిమీద నుంచి ఇవతలకుతీసి "ఈ పదార్థంమీద కాలు పెట్టగానే ఎడమకాలు అతితేలికగానూ, ఇవతల నేలమీదవున్న కుడికాలును ఎవరో బలంగా లాగివేస్తున్నట్లుగానూ అనిపించింది. ఆ లాగుడుకి నా కాలు ఊడిపోతుందేమోననిపించి అప్రయత్నంగా కేకవేశాను" అంటూ జరిగింది వివరించాడు.

"చిత్రంగా వుందే? నేను రెండు కాళ్ళు పెట్టి చూస్తాను" అంటూ ఆనంద్ తన రెండు కాళ్ళుపెట్టి నుంచున్నాడు. వెంటనే అనందాతిరేకంతో "నా వళ్ళు ఎంతో తేలికగావుంది. గాలిలోకి తేలిపోతానేమోననినిస్తోంది" అంటూ ఎగిరి గంతేశాడు. గంతేశాడోలేదో నిలువుగా గాలిలోకి ఎగరడం ప్రారంభించాడు. వెంటనే మూర్తి ఒక్క ఎగురు ఎగిరి ఆనంద్ రెండు కాళ్ళు పట్టుకొని క్రిందకు లాగాడు. ఇద్దరు కలిసి తెల్లటి పదార్థంమీద సగభాగంగానూ, ప్రక్క నేలమీద సగభాగంగానూ ఉండేటట్లు పడ్డారు. వెంటనే ఇద్దరూ ఒకేసారి బాధకలిగినట్లుగా అరిచారు. నేలమీద పడిన వారిదేహభాగాన్ని ఎవరో లాగివేస్తున్నట్లు బాధ కలిగింది. ఇద్దరూ దొర్లుకుంటూ పూర్తిగా ఇవతలి నేలమీదకు వచ్చేశారు.

కొంత సేపటివరకు వాళ్ళు ఆ విచిత్రానుభూతికి నిశ్చేష్టులై అలాగే ఉండిపోయారు. ముడిపడిన మూర్తి కనుబొమలు చూస్తుంటే అతనేదో తీవ్రంగా ఆలోచిస్తున్నట్లనిపిస్తోంది. అంతలో ఉన్నట్లుండి మూర్తి "ఆనంద్ ఈ రహస్యాన్ని నేను ఛేదించాను" అని గట్టిగా అరిచాడు.

ఆనంద్ అతనివంక ప్రశ్నార్థకంగా చూశాడు. "ఇక్కడి నేలలోవున్న పదార్థంలో ఏదో ప్రత్యేకత ఉంది. దానిమీద డైనమైట్‌ను ప్రేల్చినప్పుడు జనించిన ఉష్ణంవలన దానికి రసాయనిక మార్పు కలిగింది. ఆ విధంగా యేర్పడిన నూతన పదార్థం భూమ్యాకర్షణ శక్తిని నిరోధించేదిగా తయారయింది. గ్రావిటీ (గురుత్వాకర్షణ)ని లేకుండా చేసే ఈ పదార్థానికి 'గ్రావైట్' అని పేరుపెడ్దాం" అన్నాడు మూర్తి.

"అయితే ఈ పదార్థం పూర్తిగా ఎందుకు ఆకాశంలోకి ఎగిరిపోలేదు" అని అడిగాడు ఆనంద్.

"ఈ పదార్థం ఏర్పడింది కొద్ది ప్రదేశంలో మాత్రమే. ఏర్పడిన పదార్థంలో చాలా భాగం మనం చూస్తుండగానే పైకి ఎగిరిపోయింది. మిగిలిన దానిని డైనమైట్ ప్రేలినప్పుడు ఏర్పడిన గోడలు నొక్కి వేస్తున్నాయి" అని విశదీకరించాడు మూర్తి.

"అయితే ఆ గోడలమట్టిని తీసివేస్తే ఇది పైకి ఎగిరిపోతుందా?" అని మళ్ళీ ప్రశ్నించాడు ఆనంద్

"ఎగరదు. ఎందుకంటే అది నిశ్చల స్థితిలో ఉంది. అందువల్ల దానికి చలనం కలిగితేనే ఎగురుతుంది. ఉదాహరణకు అంతకుముందు నువ్వు గ్రావైట్‌మీద నిలబడినప్పుడు నీవు పైకి ఎగరలేదు. ఎప్పుడైతే పైకి గంతువేశావో అప్పుడు నీకు చలనం కలిగి పైకి ఎగిరిపోబోయావు. భౌతిక శాస్త్ర సూత్రాల ప్రకారం ప్రతి పదార్థానికి నిశ్చలస్థితి ఉంటుంది. అట్టి పదార్థానికి చలనం కలిగించితే అవరోధాలు లేనంత వరకు అది గమనం కలిగిన దిశలో వెళ్ళిపోతూనే ఉంటుంది. నీవు మొదట నిలబడినప్పుడు నీ దేహం నిశ్చల స్థితిలో ఉంది. నీవు ఎగిరినప్పుడు నీ దేహానికి చలనం కలిగింది. నేను నిన్ను పట్టుకొని నీ గమనానికి అవరోధం కలిగించి ఉండకపోయినట్లయితే నీవు ఆకాశంలోకి అలా నిటారుగా వెళ్ళిపోతుండేవాడివే. మన గమనం భూమ్యాకర్షణను అధిగమించగలిగితే అనంతవిశ్వంలో గ్రహాంతరయానం సులభమవుతుంది" అన్నాడు మూర్తి వివరంగా.

"అయితే గ్రావైట్‌ని ఉపయోగించి మనం గ్రహాంతరయానం చేయవచ్చా?" అని అడిగాడు ఆనంద్.

"నిజమే ఆనంద్! నాకు ఆ ఆలోచనే రాలేదు. మనం నిజంగా గ్రహాంతరయానం చేయగలం. మన కలలన్నీ నిజమవుతాయి" అంటూ పట్టరాని ఆనందంతో మిత్రుని ఆలింగనం చేసుకున్నాడు మూర్తి.

## 2

మూర్తి, ఆనంద్‌లు గ్రావైట్‌ను గురించి అనేక పరిశోధనలు చేశారు. దానిని ఉపయోగించి అంతరిక్షయాత్ర చేయడం, సాధ్యమేననే నిర్ణయానికి వచ్చారు. తమ పరిశోధనా ఫలితాలను ప్రభుత్వానికి తెలియజేశారు. అంతే కాదు పత్రికాముఖంగా ప్రపంచమంతటికీ తెలియజేశారు. వారి పరిశోధన లోకవ్యాప్తంగా గొప్ప సంచలనాన్ని సృష్టించింది. అనేకమంది శాస్త్రవేత్తలనుంచి సంస్థల నుండి వారికి శరపరంపరగా అభినందన సందేశాలు అందసాగాయి. దానితో వారు ముప్పిరిగొన్న ఉత్సాహంతో స్వయంగా గ్రహాంతరయానం చేయడానికి సంకల్పించారు. ఒకరోజు అదే విషయమై మిత్రులిద్దరూ చర్చించసాగారు.

"ఈ అనంతవిశ్వంలో కోటాను కోట్ల లోకాలలో జీవంఉన్నా ఇప్పటి మన విజ్ఞానంతో సౌరకుటుంబాన్ని దాటిపోలేం. మరి మనం ఏ గోళానికి యాత్ర సల్పితే బాగుంటుంది?" అని అడిగాడు ఆనంద్.

"మన భూమికి అత్యంత సమీపంగా ఉన్న ఉపగ్రహం చంద్రుడు. దీనీమీద మానవులు కాలూని పరిశోధించడం జరిగింది. అంతకుమించి 'ల్యూనిక్'లు, 'మూన్‌బగ్గీలు' వంటి వాటిద్వారా నిశితమైన పరిశోధన విశేషంగా జరిగింది. ఇంకా జరుగుతోంది. ఈ పరిశోధనలవల్ల చంద్రునిపై ఏ రకమైన జీవం, ఆఖరికి బాక్టీరియాకూడా లేదని తేలింది. ఇకపోతే మన భూమికి బాగా దగ్గరగాఉన్న గ్రహాలు బుధుడు, శుక్రుడు. బుధుడిమీద కూడా చంద్రునిపైవలె గాలిగాని, నీరుగాని, ఏ విధమైన జీవంగానిలేదు. పైగా అది సూర్యుడికి అతి సమీపంగా ఉండడము వలన దానిపైన లోహాలుకూడా కరిగిపోయేటంత వేడి ఉంటుంది. అందువలన ఈగ్రహంపై కనీసం కాలూనడం కూడా సాధ్యంకాదు. శుక్రునిపైన కూడా సీసం కూడా కరిగిపోయేటంత భరించలేని ఉష్ణం ఉంటుంది. నీరులేదు. పైగా భూమిమీదకంటే నూరురెట్లు ఎక్కువ దట్టంగా వాతావరణం ఉంది. అక్కడి తీవ్రమైన ఎండలమూలంగా ఈ దట్టమైన వాతావరణం మూలంగా మన ఊహకి అందనంత పెద్ద ఇసుక తుఫానులు నిత్యమూ వస్తుంటాయి, ఏతావాతాకాలిన పెనాలవంటి ఉపరితలాలుగల ఈ రెండు గ్రహాలమీద ఏ విధమైన జీవకోటి ఉండే అవకాశం లేదు. మనం వెళ్ళి చేయగలిగిందీ లేదు. ఇకపోతే గురు, శని, యురేనస్, నెప్ట్యూన్, ప్లూటో గ్రహాలు సూర్యునినుంచి వందల కోట్ల మైళ్ళ దూరంలో ఉన్నాయి. బుధ, శుక్రులు నిప్పులుకక్కే గోశాలలయితే ఇవన్నీ అతిశీతల గ్రహాలు, వేలాదిమైళ్ళ మేరకు గడ్డకట్టిన మంచుతోనూ, మిథేన్, అమోనియావంటి విషవాయువులతోనూ నిండివున్న గ్రహాలు. వీటిమీద కూడా జీవకోటివుండే అవకాశం ఎంతమాత్రం లేదు. అందువల్ల మన అంతరిక్ష యాత్రకి ఇవికూడా పనికిరానివే" అంటూ వివరించసాగాడు డాక్టర్ మూర్తి.

"ఆగాగు. మధ్యలో అంగారకుడిని వదిలేశావు" అంటూ అడ్డుతగిలాడు డాక్టర్ ఆనంద్.

"వదిలేయలేదు. కావాలనే చెప్పలేదు. ముందు మనకి పనికిరాని వాటిని ఏరేస్తే పనికివచ్చేవాటి గురించి విపులముగా చర్చించుకోవచ్చు. అంగారకుడు బుధ, శుక్రుల్లా కాలూన్చలేనట్టి ఉష్ణగ్రహం కాదు. శీతలగ్రహమే కాని గురు, శని మొదలైన వాటివలె అతిశీతల గ్రహం కాదు. పైగా మన భూమికీ, అంగారకుడికీ చాలా పోలికలున్నాయి. రెండిటి దిన పరిమాణం ఒక్కటే. దీనిపైనా వాతావరణం ఉంది. కనీసం ధృవాల

దగ్గర మంచు రూపంలో నీరుంది. ఋతువుల మార్పులు జరుగుతాయి. వీటన్నింటినిబట్టి జీవజాలం వుండే అవకాశం ఇక్కడ ఉంది. మన అంతరిక్షయానానికి అనువైన యాత్రా స్థలంకూడా ఇదే.

"అంతరిక్షశాస్త్రంలో ప్రత్యేక ప్రజ్ఞ కలిగిన నువ్వు ఇలా మాట్లాడుతుంటే నాకు ఆశ్చర్యంగా ఉంది. అమెరికా జరిపిన వైకింగ్ ప్రయోగాల ద్వారా అంగారకుడిమీద వృక్షజాలంకాదుకదా, కనీసం గడ్డపరకలుకూడా లేవని నిరూపితమయింది. ఆఖరికి సూక్ష్మజీవులు వున్న దాఖలాలుకూడా కనిపించలేదు. వైకింగ్ అంతరిక్ష నౌకలు తీసి భూమికి పంపిన వేలాది ఫోటోలలో కేవలం శిలలేతప్ప ఎటువంటి వృక్షజాలంగాని జీవకోటిగాని ఉన్న సూచనైనా కనిపించలేదు. అటువంటప్పుడు అంగారకునిమీద జీవకోటి ఉండే అవకాశం ఉందనే పాత భావాన్ని తిరిగి నువ్వు పాడుతున్నావంటే ఏమనాలో తెలియడంలేదు" అన్నాడు ఆనంద్.

మూర్తి చిరునవ్వునవ్వాడు "నువ్వు చెప్పింది నిజమే కాదనను. అంగారకుని మీద వైకింగ్ జరిపిన ప్రయోగ ఫలితాలు కొన్ని సూక్ష్మజీవుల ఉనికిని తెలియజేశాయి. కాని ఈ మార్పులకి కారణం సూక్ష్మజీవులు కాదు-అక్కడ ఏర్పడుతున్న రసాయనిక మార్పులవల్లనే అని కొందరు అభిప్రాయపడ్డారు. ఏమైనా ఈ విషయంలో శాస్త్రజ్ఞులమధ్య అభిప్రాయ భేదాలున్నాయి. ఆ మాట అలా ఉంచు. వైకింగ్ పంపిన ఫోటోలద్వారా ఆగ్రహంమీద ఒకప్పుడు పెద్ద పెద్ద నదులు పారినట్లు, అవి ఇంకిపోయినట్లు వెల్లడి అవుతోంది. సర్వసృష్టికి మూలంగాలి, నీరు. కనుక ఈ రెండు ఉన్నప్పుడు పైగా అక్కడ నదులు పారుతుండినప్పుడు అందులో జీవసృష్టి కూడా జరిగి వుండవచ్చు. ఏ దశవరకు ఆ పరిణామం జరిగిందో ఇప్పుడు చెప్పలేం. వైకింగ్ పంపిన ఫోటోలు కొన్నింటిలో పెద్ద పెద్ద గోడలు, ఆనకట్టలు, వంతెనలు వంటి దృశ్యాలున్నాయి. వాటి తీరుచూస్తే అవి సహజంగా యేర్పడినవి కాకుండా ఎవరిచేతనైనా నిర్మించబడ్డాయేమో అనిపిస్తుంది. అంగారకునిమీద ఎటువంటి జీవకణజాలపు ఉనికీ గమనించబడలేదు. కనుక ఇవన్నీ సహజంగా యేర్పడిన శిలలేనని శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు. అయితే నా అభిప్రాయం ప్రకారం అంగారకుడిమీద గతంలో జీవసృష్టి జరగడమేకాకుండా అది అభివృద్ధి చెందిన నాగరికత కలిగిన మానవుని దశ వరకు పరిణామం చెందింది. ఆ తర్వాత ఏ కారణం చేతనో ఆ గ్రహం మీద పరిస్థితులు జీవజాలపు మనుగడకు ప్రతికూలంగా మారాయి. అందువలన క్రమక్రమంగా అక్కడ సర్వసృష్టి పూర్తిగా అంతరించింది. నదులు ఎండిపోయాయి. చెట్లు అంతరించటంతో గాలిలో ప్రాణవాయువు అంతకంతకీ తగ్గిపోయింది. నీరు కొద్దిమేరకు కేవలం ధ్రువాల దగ్గరే. అదికూడా మంచురూపంలో మిగిలిపోయింది. నిజానికి ఈ మంచుకూడా నీటిదికాదని, కార్బన్‌డై ఆక్సైడ్ ఘనీభవించగా యేర్పడినదని కొందరు శాస్త్రవేత్తల అభిప్రాయం. ఆ విషయం అలావుంచు. సృష్టి అంతరించడంతో క్రమముగా ఇసుక తుఫానులు అక్కడి నిర్మితమైన ఊళ్ళని, నగరాలని ఇసుకతో కప్పివేశాయి. అతి ఎత్తైన గోడలు, వంతెనలు వంటివి మాత్రమే ఇసుకలోనుంచి తలలు పైకెత్తి ఇందాక నేను చెప్పినట్లు ఫోటోలలో కనిపిస్తున్నాయి. ఇదంతా అంగారకుని గత చరిత్ర గురించి నా ఊహ. ఇదెంతవరకు నిజమో అక్కడికి వెళ్తేగాని తెలియదు. మరో విషయం ఈ ఊహే నిజమైతే మన భూమికికూడా అంగారకునిపై కలిగిన ప్రమాదం వంటిదే కలిగి ఇక్కడి సృష్టికూడా అంతరించవచ్చు. ఆ ప్రమాదానికి కారణమేమిటో తెలుసుకొనగలిగితే భూమిమీద అలాంటిది జరగనీయ కుండా జాగ్రత్తపడ వచ్చు" అన్నాడు మూర్తి.

"నువ్వు చెప్పింది సహేతుకంగా ఉంది. అన్నట్లు మరో విషయం జ్ఞప్తికి వచ్చింది కొందరు శాస్త్రజ్ఞుల

అభిప్రాయం ప్రకారం భూమి, అంగారకుడు, చంద్రుడు ఈ మూడూ మొదట్లో ఒకే గోళంగా ఉండేవి. ఆ తర్వాత ఏ కారణం వల్లనో ఈ గోళం మూడు భాగాలుగా విడిపోయింది. అదే కనుక నిజమైతే భూమిమీద ఆ కాలంలో ఉండిన జీవజాలం అవశేషాలు అంగారకునిపైనా లభించవచ్చు. ఈ సిద్ధాంతాన్ని సరిచూడడానికి కూడా అక్కడికి పోవడం అవసరం" అన్నాడు ఆనంద్.

"బాగా చెప్పావు. నువ్వు చెప్పిన సిద్ధాంతం సరియైనదే కావచ్చుననడానికి కొన్ని సాక్ష్యాలున్నాయి. చంద్రునిమీద వలెనే అంగారకుడిమీదకూడా వలయపర్వతాలు (క్రేటర్స్), గోతులున్నాయి. భూమికి, అంగారకునికి దిన పరిమాణం 24 గంటలే. ఇంకా ఎన్నో భౌతిక శాస్త్ర సిద్ధాంతాలకు అనుగుణమైన సాక్ష్యాలు ఉన్నాయి. మన ప్రాచీన హైందవ శాస్త్రజ్ఞులుకూడా అదే భావాన్ని వ్యక్తం చేశారు. చంద్రుడు సముద్ర మథన సమయంలో భూమినుండి పుట్టాడని పురాణాలు చెప్తున్నాయి. నవగ్రహ స్తోత్రంలో అంగారకుని "ధరణీ గర్భ సంభూతం" అంటే భూమినుంచి పుట్టినవానిగా పేర్కొనడం జరిగింది. ఈ సిద్ధాంతాలను పరిశోధించాలంటే అంగారకగ్రహయాత్ర అవసరం" అన్నాడు మూర్తి.

"ఇంకేం! అంగారక గ్రహయాత్ర కోసం ఒక పథకాన్ని సిద్ధంచేద్దాం. ఆ పథకానికి అవసరమైన మొత్తాన్ని సమకూర్చడంకోసం మన ప్రభుత్వానికేకాక, ప్రపంచవ్యాప్తంగా విజ్ఞప్తులు పంపుదాం. చరిత్ర సృష్టించి, మన దేశపు కీర్తిని అంతరిక్షంలోనికి పంపుదాం" అన్నాడు ఆనంద్.

"అలాగే చేద్దాం" అంటూ లేచాడు మూర్తి. ఆ రోజుకి ఆచర్చ ముగిసింది.

## 3

మూర్తి, ఆనంద్‌లు చేసిన విజ్ఞప్తికి ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రోత్సాహకరమైన ప్రతిస్పందన వచ్చింది. అచిరకాలంలోనే అవసరాన్ని మించిన మొత్తం సమకూరింది. ఆ ప్రోత్సాహంతో వారు పథకాన్ని అమలుపరచే ప్రయత్నాలు చురుకుగా సాగించ మొదలుపెట్టారు.

వారు గ్రావైట్‌ను తగినంత ఉత్పత్తి చేసి దానితో 20 అడుగుల వ్యాసంగల ఒక పెద్ద గోళాన్ని నిర్మించారు. అది గాలితాకిడికి చలనంకలిగి ఎగిరిపోకుండా, దానిని గట్టిగా తాళ్ళతో నేలకి బిగించారు. ఆ గోళానికిచుట్టూ పదహారు కిటికీలు అమర్చారు. ఆ కిటికీల తలుపులను మాత్రం గ్రావైట్‌తో చేశారు. వాటిలోపలి భాగం పగలని గట్టిగాజుతో చేయబడింది. ఆ కిటికీల తలుపులు అన్నీ మూసేస్తే ఆ గోళంపై ఎట్టి ఆకర్షణశక్తి ఉండదు. కాని ఏదైనా కిటికీకి వున్న గ్రావైట్ తలుపులను తెరిచినట్లయితే లోపల గాజు ఉన్న కారణంచేత ఆ ప్రదేశంపై ఆకర్షణ ఉంటుంది.

గోళానికి కట్టిన తాళ్ళను ఊడదీస్తే, గోళం తెరచిన కిటికీ దిశగా పయనిస్తుందన్నమాట. ఆ విధంగా అవసరమైన కిటికీలను తెరుచుకొని గోళాన్ని ఏ దిశలోపడితే ఆ దిశలో ప్రయాణం చేసేటట్లు చేయవచ్చు. ఇది కాక గ్రావైట్‌ను కొన్ని రసాయనిక పదార్థాలతో సంయోగపరచి, పారదర్శకంగా ఉండే పదార్థాన్ని తయారుచేశారు. దీనితో అన్ని దిశలా చూడగలిగే విధంగా ఎనిమిది కిటికీలను అమర్చారు. ఈ కిటికీలపై కూడా ఆకర్షణ శక్తి ఉండదు. ఇంకా గోళంలోపలికి వెళ్ళడానికి, బయటకు రావడానికి ఒక తలుపును అమర్చారు. గోళంలోపల అంతరిక్షయానానికి అవసరమైన సరుకులనన్నీ అమర్చారు.

ఆ రోజు ఆదివారం. ఉదయం ఎనిమిది గంటలకు గోళం ప్రయాణం మొదలిడుతుంది. ఆ

నిర్జన అటవీ ప్రాంతం జనంతో క్రిక్కిరిసిపోయింది. మూర్తి, ఆనంద్‌లు అందరివద్ద సెలవు తీసుకున్నారు. 7-30 గంటలకు గోళంలోపలికి వెళ్ళారు. వెంట షాగీ, జాకీ అనే రెండు కుక్కలను తీసుకుని వెళ్ళారు. వాళ్ళు లోపలికి వెళ్ళగానే. తలుపు మూసుకుంది. లోపల కుర్చీలలో కూర్చుని నడుముకు పటకాలు బిగించుకున్నారు. అక్కడ జనసందోహంలో ఆనందంతోపాటు ఆందోళనకూడా చోటుచేసుకుంది. మూర్తి, ఆనంద్ ఇద్దరూ బ్రహ్మచారులే. జీవితాన్ని అనుభవించనివారు. పిన్నవయసులోనే దేశానికి ఎంతో పేరు ప్రతిష్టలు తెచ్చినవారు. అటువంటివారు ఈ లోకాన్ని వదిలి వెళ్ళిపోతున్నారు. తిరిగి వస్తారో...రారో! రాకపోవడానికే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అందరి ముఖాలలోనూ, ముఖ్యంగా వారి బంధువుల ముఖాలలో ఆవేదన, ఆందోళన ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. నిమిషాలు గడుస్తున్నకొద్ది అవి అంతకంతకి ఎక్కువవుతున్నాయి.

సమయం 7-45 అయింది. గోళానికి కట్టిన త్రాళ్ళని ఒక్కొక్కదాన్ని విప్పారు. సరిగ్గా ఎనిమిది గంటలకు ప్రధానమంత్రి ఆ అంతరిక్షయాన ప్రారంభ సూచకంగా చివరి త్రాటిని విప్పారు. చూస్తుండగా గోళం తారాజువ్వలాగా ఆకాశంలోకి లేచింది. పదిహేను నిమిషాలైనా గడవకముందే అనంతాకాశంలో అదృశ్యమయింది.

గ్రావైట్ కిటికీలద్వారా భూమీ కనిపిస్తోంది. ఆ దృశ్యాన్నే వింతగా చూడసాగారు మిత్రులిద్దరూ చూస్తుండగానే బల్లపరుపుగా ఉన్న భూమి వంపుగా, ఆపైన గోళంగా మారిపోయింది. నీలిసముద్రం, మధ్యన పచ్చని నేల, నల్లని కొండలు, ఆ పైన తెల్లని మేఘాలు-అంతా ఎంతో మనోజ్ఞంగా ఉంది. చంద్రుని కళవలె భూమికి కూడా కళ కనిపిస్తుంది. భూమిపైన పగటి, రాత్రి ప్రదేశాలను వారు ఒకే కంటితో చూడగలుగుతున్నారు.

అంతవరకూ గోళంలో ఉన్న యంత్రాలు బజ్...మంటూ శబ్దాన్ని వినిపిస్తూ వచ్చాయి. ఆ శబ్దం అంతకంతకు తగ్గుతూ చివరకు ఆగిపోయింది.

"మన అంతరిక్ష నౌక భూమిపైనుండే గాలిపొరలలో నుంచి ప్రయాణం చేయడం వలన ఆ శబ్దం ఏర్పడింది. ఇప్పుడు అది భూ వాతావరణాన్ని ఇంచుమించు పూర్తిగా దాటివేసిందన్నమాట. అంతటి వేగంతో మరే ఇతర పదార్థామైనా ప్రయాణించిఉంటే, అది గాలిరాపిడికి మండిపోయేదే. కాని మన పరిశోధనల మూలంగా ప్రత్యేకంగా తయారయిన ఈ గోళం అంతటి రాపిడిని తట్టుకోగలిగింది. పైగా దీని ప్రత్యేకత మూలంగా ఉష్ణంలోనికి ప్రసరించదు. ప్రస్తుతం ఈ గోళోపరితలం రాళ్ళను సైతం కరిగించేటంతటి వేడిమికలదై ఉంటుంది" అని వివరించాడు మూర్తి.

ఆనంద్ ఫ్లాస్క్ అందుకొని కప్పుల్లో కాఫీ పోయబోయాడు. కాని కాఫీ కప్పులో పడకుండా తిన్నగా గోళం మధ్యకి వెళ్ళిపోయింది. కొంచెం అతని బట్టలమీదకు ఒలికింది. అతను ఆశ్చర్యంతో మాట్లాడలేకపోయాడు. మూర్తికి నవ్వాగలేదు. తనివితీరా నవ్వాక "ఈ గోళం లోపలిభాగం మామూలు పదార్థంతో చేయబడటంవలన, దాని ఆకర్షణశక్తి గోళం మధ్యలో ఉంటుంది. అందువలన సహజంగా ప్రతివస్తువు అటువైపు ఆకర్షింపబడుతుంది. నీ దేహానికికూడా కొంత ఆకర్షణశక్తి ఉండటంవలన కొంచెం కాఫీ నీమీద వలికింది. ఎక్కువ భాగం గోళం మధ్యకు పోయింది. తాడుపుచ్చుకొని గోళం మధ్యకు

కప్పును తీసుకెళ్ళు. కాఫీ అందులో పడుతుంది. అప్పుడు జాగ్రత్తగా కప్పును మూసి కాఫీ తీసుకురా" అని సలహా ఇచ్చాడు.

మూర్తి చెప్పినట్లే చేయబోయాడు ఆనంద్. కప్పును గోళంమధ్యకు తీసుకొనిపోవడంతో అతని చేయి ట్రాటిని వదిలింది. అంతే...అతను నించున్నవాడు నించున్నట్లే గోళం మధ్యకుపోయి తేలడం మొదలుపెట్టాడు. మూర్తి అతని చేయి పట్టుకొని తనవైపు లాగాడు. ఎలోగైతే వారు కాఫీలు పూర్తి చేశారు.

వాళ్ళు కిటికీలోంచి భూమివైపుకు చూశారు. భూమిబాగా చిన్నదైపోయింది. ఎటుచూసినా నక్షత్రాలు విపరీతమైన కాంతిలో ఎలక్ట్రిక్ దీపాలలాగా మెరుస్తున్నాయి. వాటి వెనుక నల్లని ఆకాశం ఒక విధమైన భయాన్ని కొల్పుతోంది.

మూర్తి "మన భూమిమీద వాతావరణం ఉండడంవలన అది సూర్యకాంతిలోని నీలికిరణాలను చెదరగొట్టి ఆకాశం నీలంగా ఉన్నట్లు భ్రమకల్పిస్తుంది. కాని విశ్వాంతరాళంలో గాలి లేనందువల్ల ఆకాశం నల్లగా కనిపిస్తుంది" అని విశదపరిచాడు.

## 4

ప్రయాణం మూడు రోజులు సాగింది. ఆ రోజు ఏ కారణం చేతనో జాకీ అన్న కుక్క మరణించింది. మిత్రులిద్దరూ దాని మృతికి చాలా విచారించారు. దాని మృతదేహాన్ని విశ్వాంతరాళంలో వదిలివేయడానికి నిశ్చయించారు.

ఆనంద్ "మనం దీనిని బయటకు పారవేయడానికి తలుపుతీస్తే లోనిగాలి బయటకు పోతుందేమో!" అని సందేహాన్ని వ్యక్తం చేశాడు.

"మరేం ఫర్వాలేదు. గోళం యొక్క ఆకర్షణ శక్తి మూలంగా గాలి లోపలనే ఉంటుంది" అని సందేహానివృత్తి చేశాడు మూర్తి.

ఆనంద్ గోళం తలుపుతీసి జాకీదేహాన్ని బయటకు వదిలేశాడు. బయట గాలికూడా గడ్డకట్టుకుపోయేటంత చల్లగా ఉంది. తలుపుమూసి తిరిగివచ్చి తన స్థానంలో కూర్చున్నాడు. అతనికి కిటికీలోనుంచి ఒక వింత దృశ్యం కన్పించింది. అమాంతంగా అతను మూర్తి భుజంతట్టి "చూడుచూడు జాకీ దేహం మన గోళం వెంబడే వస్తోంది" అని చూపించాడు.

మూర్తి "అవును మనం తెరచి ఉంచిన ఈ కిటీకీ ద్వారా కుక్క ఆకర్షించబడింది. దీని గ్రావైట్ తలుపులను మూసివేస్తే అది విశ్వాంతరాళంలోకి అలా వెళ్ళిపోతూనే ఉంటుంది. ఈ చలిలో అది ఎన్నివేల సంవత్సరాలు గడిచినా చెక్కుచెదరకుండా అలాగే ఉంటుంది. ఏదైనా గ్రహంకాని, అల్పగ్రహంకాని ఇటువస్తే ఇది అటు ఆకర్షించబడి దానిపై పడిపోతుంది. లేకుంటే అలా అనంతయాత్ర చేస్తూనే ఉంటుంది" అని వివరించాడు.

ఇంతలో భయంకరమైన విపత్తు ఒకటి తారసిల్లబోయింది. కిటికీలోనుంచి చూస్తున్న వాళ్ళకు అనతిదూరంలో ఒక ఉల్క బ్రహ్మాండమైన వేగంతో గోళంవైపు వస్తూ కన్పించింది. నిమిషంలో అది వచ్చి గోళాన్ని గ్రుద్దివేస్తుంది. అంతటితో ఆ గోళం చరిత్ర, మిత్రులిద్దరి చరిత్ర పరిసమాప్తి అవుతుంది. ప్రమాదం

కనిపెట్టిన మూర్తి ఉల్కకు వ్యతిరకదిశలో ఉన్న నాలుగు కిటికీలను త్వరగా తెరిచేశాడు. వెంటనే గోళం ఆ దిశగా వేగాన్ని పుంజుకుంది. ఉల్క గోళాన్ని ఇంచుమించుగా దూసుకుంటూ వెళ్ళిపోయింది. అది తనతోపాటు జాకీ దేహాన్ని కూడా తీసుకునిపోయింది. వీరికి ప్రమాదం తప్పింది.

నెలరోజులు గడిచాయి. అంగారక గ్రహాన్ని చేరడానికి ఇంకా ఒక్క రోజు మాత్రమే మిగిలివుంది. అప్పుడే గోళాన్ని జాగ్రత్తగా అదుపులో పెట్టుకోవాలి. మధ్యాహ్నం రెండు గంటలకు గోళం అంగారక గ్రహపు ఆకర్షణ పరిధిలోకి జేరి ఆ గ్రహం చుట్టూ దీర్ఘ అండవృత్తాలు చేయసాగింది. అక్కడనుంచి టెలిస్కోప్ ద్వారా వారు అంగారక గ్రహమండలాన్ని పరిశీలించడం మొదలుపెట్టారు.

రోదసినుంచి అంగారక గ్రహాన్ని పరిశోధించడం పూర్తి అయ్యాక అంగారకుడి వైపునుండే కిటికీని తెరిచాడు మూర్తి. గోళం వేగాన్ని పుంజుకుంటూ గ్రహం దిశగా పయనించసాగింది. రోదసినుంచి గ్రహంతోపాటు అంగారకుని ఉపగ్రహాలైన ఫోబాస్, డైమోస్‌లను కూడా పరిశోధించారు. అని రెండూ అతిచిన్న అల్పగోళాలు. వాటి వ్యాసం కొద్ది కిలోమీటర్లు మాత్రమే. అవి అంగారకునికి, గురుగ్రహానికి మధ్యన ఉన్న వేలాది అల్పగ్రహాలకు చెంది, అంగారకుని ఆకర్షణచేత లాగబడి ఉపగ్రహాలుగా మారినవై ఉంటాయని భావించాడు మూర్తి.

గోళం అంగారకునికి బాగా చేరువ అయింది. మూర్తి, ఆనంద్ టెలిస్కోప్ ద్వారా గ్రహోపరిభాగాన్ని అత్యంతోత్సాహంతో పరిశీలిస్తున్నారు. మంచుతో కప్పబడిన ధ్రువాలు, పెద్ద పెద్ద మైదానాలు, వలయపర్వతాలు చెల్లాచెదురుగావున్న శిలలు అన్నీ వింత అందంతో కనిపిస్తున్నాయి. గ్రహంమీద పగలు, రాత్రి భాగాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గ్రహోపరితలంమీద మాత్రం చెట్టుచేమలు ఏమీ ఉన్నట్లు కనిపించడంలేదు. గోళం గ్రహోపరితలాన్ని బాగా సమీపించింది. గోళం మహావేగంతో క్రిందకు దూసుకుపోతోంది. ఆ సమయంలో గ్రానైట్ తలుపులను జాగ్రత్తగా మూసి గోళం వేగాన్ని అదుపుచేసి ఎంతోనేర్పుతో నేలమీదికి దింపాలి. అయితే దురదృష్టవశాత్తు ఆ సమయంలో అంగారక గ్రహంపై ఉన్న కిటికీ ఒకటి ఏ కారణంచేతనో మూసుకోవడం మానివేసింది. ఎంత ప్రయత్నించినా అది మూసుకోలేదు. ఇంక సమయములేదు. మరో పది, పదిహేను నిముషాలలో అది మహావేగంతో అంగారకగ్రహాన్ని ఢీకొని తునాతునకలైపోతుంది.

మూర్తి వెంటనే "ఆనంద్! నువ్వు ధరించిన గ్రహాంతరయాన దుస్తుల్ని సరిచూసుకో షాగీకీ కూడా సరిచూడు. వెంటనే పారాచ్యూట్‌ను తగిలించుకో. నీ చేత్తో షాగీని పట్టుకో నేను పారాచ్యూట్ తగిలించుకుంటాను. వెంటనే మనం క్రిందకు దూకేయాలి. వీలైతే చేతికందిన సామాను తీసుకుందాం" అన్నాడు త్వరత్వరగా.

మూర్తి చెప్పినట్లే చేశాడు ఆనంద్. మూర్తికూడా పారాచ్యూట్ తగిలించుకున్నాడు. గోళం మహావేగంతో నేలను సమీపిస్తోంది. మిత్రులిద్దరూ షాగీతో సహా, గోళం తలుపుతీసి క్రిందకు దూకేశారు. వెంటనే ఎవరో వాళ్ళ వీపుల్ని బలంగా లాగినట్లనిపించింది. పారాచ్యూట్లు తెరుకున్నాయి. వాళ్ళు నెమ్మదిగా క్రిందకు దిగసాగారు. అంగారకుని మీద గాలి ఉండడంవల్ల పారాచ్యూట్లు ఉపకరించాయి.

చూస్తుండగా మరునిమిషంలో గోళం ఒక విశాలమైన మైదానాన్ని ఢీకొని తునాతునకలైపోయింది.

వెంటనే మంటలు లేచి అతిత్వరలోనే చల్లారిపోయాయి. అంగారకుని వాతావరణంలో ప్రాణవాయువు అతితక్కువగా ఉండడం వల్ల ఇలా జరిగింది.

గోళం పడిన స్థలానికి సుమారు 3 కిలోమీటర్ల దూరంలో మూర్తి, ఆనంద్ ఉన్నారు. వ్యవధి లేకపోవడంవల్ల ఏ విధమైన సామానునీ వారు వెంట తెచ్చుకోలేకపోయారు. గోళం గతి ఏమైనదోనన్న దిగులుతో వారు ఆ దిశగా పరుగెత్తారు. వాళ్ళ కాళ్ళు నేలమీద తేలిపోతున్నాయి. ఇక్కడ గంతువేస్తే అక్కడికి పోతున్నారు. ఎంతదూరమైనా ఇట్టే పరుగెత్త వచ్చు ననిపించింది. ఇందుకు కారణం అంగారకునిమీద ఆకర్షణ భూమిమీదకంటే బాగా తక్కువ కావడమే. ఆ మూడు కిలోమీటర్ల దూరం వెళ్ళడానికి వారికి పదినిమిషాలుకూడా పట్టలేదు.

వారు గోళం కూలిపోయిన చోటును చేరుకున్నారు.

గోళం తునాతునకలై ఉంది. గ్రానైట్ ముక్కలు అనేకం అంతరిక్షంలోకి ఎగిరిపోయాయి. భోజనసామాగ్రి, దుస్తులు, రేడియో ప్రసారక యంత్రంతో సహా యంత్రాలన్నీ ముక్కలు ముక్కలయి ఎందుకూ పనికిరాకుండా పోయాయి.

ఆనంద్! మన అంతరిక్షయాత్ర ఈ విధంగా పరిసమాప్తి అవుతుందనుకోలేదు. ఇక మనకీ భూమికీ ఋణం తీరిపోయింది. ఈ నిర్జన లోకంలో మనకు మృత్యువు తప్పదు" అన్నాడు ఆవేదనతో మూర్తి.

"దిగులుపడకు మూర్తీ. అవసరం కలిగినప్పుడే మనిషిబుద్ధి వికసిస్తుంది. మనకు ఏదోఒక ఉపాయం తట్టకపోదు. ఒకవేళ మనం మరణించినా అది వీర మరణం అవుతుంది" అని ప్రోత్సాహపరిచాడు ఆనంద్.

"ముందు మనం ఈ చెల్లాచెదురైన మన సామాగ్రిలో పనికివచ్చే దాన్ని ఏరుకుని ఎక్కడైనా భద్రపరచుకోవాలి. ఈ దగ్గరలో మంచిచోటు ఏమైనా కనిస్తుందేమో వెతుకుదాం పద" అన్నాడు మూర్తి.

అనతి దూరంలోనే ఒక కొండ, అందులో ఒక గుహ కనిపించాయి. మూర్తి, ఆనంద్ అందులోకి వెళ్ళి చూశారు. అక్కడి దృశ్యం చూసి వాళ్ళకి అమిత ఆనందాశ్చర్యాలు కలిగాయి. ఆ గుహలోపల వెలుగును వెదజల్లే మొక్కలున్నాయి. గోడలనుంచి నీరు ఊరి సన్నధారలుగా కారుతోంది. మొక్కల వెలుగుతో గుహ ప్రకాశవంతంగా ఉంది.

మూర్తి "ఈ గుహ మనకి అనువుగా ఉంది. అంగారక గ్రహం మీద అల్పతరగతి జీవజాలం ఉందని రుజువైంది. అయితే నేలపైన బొత్తిగాలేకపోవడంతో వైకింగ్ నౌకలు దీని ఉనికిని గుర్తించలేకపోయాయి. ఇంకా ఇక్కడ ఎటువంటి జీవం ఉందో! ముందు మన సామాను ఇక్కడకు చేర్చుకున్నాక అన్వేషిద్దాం" అన్నాడు.

వారిద్దరూ, చెదిరిపోయిన సామగ్రిదగ్గరకు వెళ్ళారు. దానిని ఏ విధంగా గుహకు తీసుకువెళ్ళాలో అన్న సమస్య ఎదురయింది.

ఆనంద్ "అక్కడ ఇంకా కొన్ని గ్రానైట్ ముక్కలు నిశ్చలస్థితిలో పడి ఉన్నాయి కదా! వాటి సహాయంతో ఈ సామగ్రిని మనం సులువుగా తీసుకొని పోవచ్చు" అన్నాడు.

"అవును. అంతేకాదు మన బూట్లకు అడుగున ఈ గ్రావైట్ ముక్కలను కట్టుకుంటే అతివేగంతో పరిగెత్తవచ్చు" అన్నాడు మూర్తి.

ఆ ప్రకారం వారు గ్రావైట్ ఉపయోగించి అతిత్వరలో సామానును గుహకు చేర్చారు. తక్కిన భోజన పదార్థాలని షాగీతోసహా ఆరగించారు. అలసటకి వాళ్ళకి నిద్రముంచుకొచ్చింది. కొంత సేపు ఆదమరచి నిద్రపోయి లేచారు. అంగారక గ్రహ మండలాన్ని పరిశోధించడానికి సిద్ధమయ్యారు. ఆ గుహ గుర్తుగా ఉండేటట్లు ఒకత్రాటికి గ్రావైట్ ముక్కను కట్టి దానికి భారత పతాకను కట్టారు.

మొదటిసారిగా అంగారక గ్రహంపై కాలూనిన కీర్తి భారతదేశానికి దక్కింది. మిత్రులిద్దరూ అంగారక గ్రహ పరిశోధనకు బయలుదేరారు. మట్టి అంతా ముదురు ఎరుపురంగులో ఉంది. అందుకనే అంగారక గ్రహం భూమినుంచి చూస్తే కణకణలాడేనిప్పులా ఎర్రగా మెరుస్తూ కనిపిస్తుంది. ఆ మట్టిని పరీక్షించి చూశాడు మూర్తి. అందులో ఐరన్ ఆక్సయిడ్ ఎక్కువున్నట్లు అనిపించింది. ఏ కారణంచేతనో గాలిలోని ప్రాణవాయువుని ఆ మట్టి పీల్చివేసిందన్నమాట. అంటే ఒకప్పుడు అక్కడి వాతావరణంలో ఆక్సిజన్ పుష్కలంగా ఉందన్నమాట. మరికొంతదూరం పోయేసరికి లోయ వంటిది కనిపించింది. దగ్గరకుపోయిచూస్తే అక్కడ ఒకప్పుడు పెద్ద నది ప్రవహించినట్లనిపించింది. అక్కడి నేలకూడా మెత్తగా, ఇసుకలాగా ఉంది. అక్కడ లోతుగా త్రవ్వితే నీరు ఉంటుందన్న నమ్మకం కలిగింది మూర్తికి. అయితే ఎక్కడా ఎటువంటి మొక్కలుకాని, కీటకాలుగాని కనిపించలేదు.

ఆ ప్రాంతాన్ని పరిశోధించిన మూర్తి "దురదృష్టవశాత్తు మన యంత్రాలు, పరికరాలు అన్నీ నాశనమైపోయాయి. అందువల్ల ఏ విషయాన్ని ఖచ్చితంగా చెప్పలేకపోతున్నాను. ఇంతవరకు నేను గమనించినదాని ప్రకారం బహుశా ఒకప్పుడు అంగారకుడు భూమిలో అంతర్భాగమే. చంద్రుడుకూడా కలిసే ఉండవచ్చు. గాలి, నీరు, తగిన ఉష్ణోగ్రత ఉన్న ఈ చోట గతంలో జీవసృష్టి అవతరించింది. నా నమ్మకం ప్రకారం ఇక్కడ నేలనిత్రవ్వితే తప్పక పురాతన అవశేషాలు బయటపడతాయి" అన్నాడు.

"అటు చూడు. ఈ నదిలాంటిదాని ఒడ్డున ఏదో గోడలాగా కనిపిస్తోంది" అన్నాడు ఆనంద్.

ఇద్దరూ దగ్గరికివెళ్ళి చూశారు. అది కేవలం గోడకాదు. రాతితో కట్టిన ఒక పెద్ద భవనంలో భాగం. ఆశ్చర్యంతో వాళ్ళు కొంతసేపు అలాగే ఉండిపోయారు.

మూర్తి "మనం అనుకున్నట్లే ఒకప్పుడు ఇక్కడ మానవుని వరకూ పరిణామం చెందిన జీవం ఉండిందన్న మన అనుమానం నిజమయింది. మరి ఈ సృష్టి ఎందుకు అంతరించిందో?" అంటూ ముందుకు సాగాడు.

ఆ కట్టడం దగ్గరికి వెళ్ళేసరికి వాళ్ళు మరింత ఆశ్చర్యంతో మునిగిపోయారు. అది బ్రహ్మాండమైన పిరమిడ్. లోపలికి పోయి చూస్తే గోడలమీద ఎన్నో చిత్రాలు, మధ్యలో నేలమీద పెద్ద పెట్టెలలో మమ్మీలున్నాయి. గోడలకున్న మణులు కాంతుల్నిస్తున్నాయి. లోపల కొన్ని మొక్కలుకూడా వెలుగును వెదజల్లుతున్నాయి.

"ఈ విచిత్రం చూశావా! మన భూమి మీద ఈజిప్టు దేశంలో, నైలు నదితీరంలో ఎన్నో బ్రహ్మాండమైన పిరమిడ్‌లు ఉన్నాయి. వాటిని ఇతర గ్రహవాసులు నిర్మించారన్న సిద్ధాంతం ఒకటి ఉంది. ఇక్కడకూడా

ఈ పిరమిడ్‌లు చూశాక ఈ సిద్ధాంతం నిజమేనేమోననిపిస్తుంది. ఇతర నక్షత్ర మండలాలకు చెందిన బుద్ధిజీవులు మన భూమిమీద, ఈ అంగారక గ్రహంమీద కూడా ఈ పిరమిడ్‌లు నిర్మించి ఉండవచ్చు. ఈ కుడ్య చిత్రాలని పరిశీలిస్తే, ఇక్కడి చరిత్ర మనకేమైనా తెలుస్తుందేమో. కాని ఇక్కడి వెల్తురు చాలదు" అన్నాడు మూర్తి. మరికొంచెం సేపటిలో సూర్యుడు బాగా పైకి వచ్చాడు. ఆ పిరమిడ్ ద్వారాలు సూర్యునికి అభిముఖంగా ఉండడంతో వెల్తురు బాగా లోపలికి వచ్చింది. దాంతో గోడలమీద చిత్రాలు స్పష్టంగా కనిపించసాగాయి.

ముందు వాళ్ళిద్దరు సమాధులలోని మృతదేహాలు పరిశీలించారు. అవి మానవ దేహాలనేపోలి ఉన్నాయి. అయితే వారు బాగా పొడగరులు. వేషధారణకూడా ప్రాచీన మానవులదిలాగానే ఉంది.

"భూమిమీద, అంగారకుడిమీద ఒకే విధమైన మానవరూపాలు ఉండడం, ఈ రెండిటిమీద సృష్టి ఒకేరకంగా పరిణమించడాన్ని సూచిస్తోంది. ఇది ఈ రెండు గ్రహాలు ఒకప్పుడు కలిసి ఉండేవన్న వాదాన్ని బలపరుస్తోంది" అన్నాడు మూర్తి.

ఆ తర్వాత కుడ్య చిత్రాలను ఇద్దరూ పరిశీలించారు. "మూర్తీ! నీ ఊహనిజమే కావచ్చు. ఈ చిత్రాలు క్రమంగా చూస్తే, ఈ గ్రహ చరిత్ర అవగతమవుతోంది" అన్నాడు ఆనంద్ ఆనందంతో.

"అవును. ఇదిగో ఈ చిత్రంలోని గోళం మన భూమినిపోలి ఉంది. తర్వాత చిత్రంలో గోళం చిన్నదిగా ఉంది. అది బహుశ అంగారకుడు భూమినుంచి విడిపోవడాన్ని సూచించవచ్చు. తర్వాతి చిత్రాలలో అడవులు, నగరాలు, మనుష్యులు, జంతువులు కనిపిస్తున్నాయి. అంటే జీవజాలంతో ఈ లోకం కళకళలాడుతుండేదన్నమాట. ఆ తర్వాతి చిత్రాలలో అణుబాంబుల విస్ఫోటం కనిపిస్తోంది. చివరి చిత్రాలలో చెట్లని నరికివేయడం, నేల ఎర్రగా మారడం కనిపిస్తోంది. చివరి చిత్రాలలో నగరాలు కూరుకుపోవడం, కొన్ని అంతరిక్ష నౌకలు ఇతర గ్రహాల దిశగా పోవడం కనిపిస్తోంది" అన్నాడు మూర్తి.

"ఇప్పుడు ఈ గ్రహం చరిత్ర నాకు బాగా అర్థమయింది. సస్యశ్యామలంగా విజ్ఞానాభివృద్ధిలో విలసిల్లుతుండిన ఈ లోకంలో విజ్ఞానం వెర్రితలలు వేసింది. వివిధ దేశాలు అణ్వాయుధాలను ప్రయోగించాయి. ఫలితంగా కాలుష్యం ఏర్పడి, రేడియో ధార్మికశక్తివల్ల ఇక్కడి జీవజలానికి ఎంతో ముప్పు ఏర్పడింది. పైగా విచక్షణారహితంగా చెట్లను కొట్టివేయడంతో గాలిలోని ఆక్సిజన్ అంతకంతకు తగ్గిపోయింది. అణ్వస్త్రాలవల్ల నేల స్వభావంకూడా మారి, గాలిలోవున్న ఆక్సిజన్‌ని పీల్చివేసింది. చివరకి ఈ లోకం నివాసయోగ్యం కాకుండా పోయింది. అంతటితో ఇక్కడ మిగిలినవారు అంతరిక్ష నౌకలలో ఇతర గ్రహాలకు వలస పోయారు" అన్నాడు ఆనంద్.

"సరిగ్గా చెప్పావు. ఈ చిత్రంలో సూచించినదాని ప్రకారం వీరు గురుగ్రహం దిశగా వెళ్ళారు. అయితే గురుగ్రహం వాసయోగ్యంకాదు. కాని దాని ఉపగ్రహాలైన కాలిస్టో, గానిమేడ్ వంటి వాటిమీద నీరు, గాలి ఉన్నాయి. బహుశా అటువంటి వాటిమీదకు వెళ్ళి ఉండవచ్చు" అన్నాడు డాక్టర్ మూర్తి.

"ఎంత విచిత్రం! మనభూమి చరిత్రకీ, అంగారకుని చరిత్రకీ ఎంతటి సామ్యం ఉంది. ఇక్కడ జరిగిన పొరపాట్లే మన భూమిమీదకూడా జరుగుతున్నాయి. ఈ లెక్కన మన భూమికూడా త్వరలోనే నివాసయోగ్యం కాకుండా పోయి, మనం కూడా వేరే లోకాలకు వలసిపోవలసి రావచ్చును. ఈ కఠిన

వాస్తవాన్ని మనవారికి తెలియజేయడం ఎలా? కనీసం మన ట్రాన్సిస్టర్‌కూడా పనిచేయడంలేదుకదా!" అని వాపోయాడు ఆనంద్.

ఇద్దరూ కలిసి మరికొంచెం ముందుకి వెళ్ళారు.

"ఆనంద్! అటుచూడు. అక్కడ ఉన్న గోళం మనం చూసిన చిత్రాలలోని అంతరిక్షనౌకవలె ఉందికదూ?" అంటూ వడివడిగా అటు నడవసాగాడుమూర్తి.

ఇద్దరూ కలిసి మరికొంచెం ముందుకి వెళ్ళారు. దానిని సమీపించిచూస్తే అది నిజంగా అంతరిక్షనౌకే. నిశితమైన మూర్తి దృష్టికి అందులోని యంత్రాల్ని పనిచేయించే విధానం తెలియడానికి ఎంతో సమయం పట్టలేదు. ఆ గోళాన్ని నిర్మించిన పదార్థాన్ని పరీక్షించి ఆనందంతో ఎగిరి గంతువేశాడు.

"ఆనంద్...ఇది కూడా గ్రానైట్‌తోనే చేయబడింది. దీనిని నేలకు గట్టిగా కట్టివేశారు. వీళ్ళుకూడా ఇటువంటి నౌకలలోనే ప్రయాణించారన్నమాట. ఈ నౌకని వాళ్ళువాళ్ళెవరికోసమో ఉద్దేశించి ఉంటారు. చివరకు అది మనకి ఉపయోగపడ్తోంది" అన్నాడు పట్టలేని ఆనందంతో.

ఆ నౌకలోని రేడియోయంత్రం ద్వారా జరిగినదానిని వివరిస్తూ భూమికి సందేశం పంపాడు మూర్తి. ఆ తర్వాత అంగారక గ్రహం మీదున్న అల్పజాతి వృక్షజాలాన్ని, శిలలనూ, మట్టినీ, ఇంకా ఎన్నింటినో నౌకలోకి జేర్చారు వాళ్ళు. వారి పిరమిడ్లలోని సమాధులదగ్గర రసాయన పదార్థాలతో నిలవ ఉంచిన ఆహార పదార్థాలు, పళ్ళూ ఉన్నాయి. వాటినీ, ఒక మమ్మీనీ కూడా నౌకలోకి ఎక్కించారు. వీలైనంతవరకు గ్రహాన్ని పరిశోధించారు.

మర్నాడు ఉదయమే నౌకలోకి ప్రవేశించారు డాక్టర్ మూర్తీ, ఆనంద్. లోపలనుంచి వేసిన ముడిని విప్పారు. వెంటనే అంతరిక్ష నౌక ఆకాశంలోకి లేచింది. మూర్తి ఆధ్వర్యంలో అది అంతకంతకూ వేగం పుంజుకుంటూ భూమివైపు పయనించసాగింది, శునకమిత్రంతో సహా.

సైన్స్‌వాణి, మార్చి 1987 ✪